సాక్షి జగిత్యాల

గురువారం । 11 । మే । 2023



మహాలక్ష్మీ అమ్మవారి బోనాలు

కథలాపూర్ : పెగ్గెర్లలో మహాలక్ష్మీ అమ్మవారి బోనాల పండుగ నిర్వహించారు. భక్తులు బోనాలతో నైవేద్యం సమర్పించారు.



ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

జగిత్యాల: టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన తాటిపల్లి గురుకుల విద్యార్థులను కలెక్టర్ యాస్మిన్‌బాషా అభినందించారు.


గరిష్టం/కనిష్టం
39.0/27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

పడిపోయిన ‘పది’ ఫలితాలు

- జిల్లాగా ఆవిర్భవించాక హ్యాట్రిక్ ఫలితాలు
- ప్రస్తుతం 24వ స్థానంతో సరిపెట్టుకున్న వైనం
- పదో తరగతిలో 84.05 శాతం ఉత్తీర్ణత



జగిత్యాల: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఎప్పుడూ అగ్రస్థానం సాధించే జిల్లా కొన్నేళ్లుగా తిరోగమనంలో పయనిస్తోంది. కరోనా నేపథ్యంతో రెండేళ్లుగా ఫలితాల సాధనలో వెనుకబడింది. ఆ తర్వాత రెండేళ్లుగా విద్యాబోధన గాడిలో పడినా ఆశించిన ఫలితాలు సాధించలేకపోతోంది.

తొలినాళ్లలో హ్యాట్రిక్..

- 2016లో జగిత్యాల జిల్లాగా ఆవిర్భవించింది. అప్పటినుంచి 2016–17, 2017–18, 2018–19 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధించింది. రాష్ట్రంలోనే చరిత్ర సృష్టించింది.
- విద్యార్థులకు ప్రత్యేక బోధన తరగతులు తీసుకోవడంతోపాటు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించి వందశాతం ఫలితాలు వచ్చేలా చూశారు. ఈ నేపథ్యంలో మూడుసార్లు హ్యాట్రిక్ ఫలితాలు సాధించింది.
- 2019లో 99.87 శాతంతో మొదటి, 2022లో 91.37 శాతంతో 21వ స్థానంలో నిలువగా, ప్రస్తుతం 24వ స్థానానికి పడిపోయింది.

ఆశించిన ఫలితాలు రాలేదు..

కరోనా నేపథ్యంలో 2020 – 2021లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. విద్యార్థులు నష్టపోకుండా ఆన్‌లైన్ పద్ధతిన విద్యాబోధన చేశారు. అయినా, పాఠాలు పెద్దగా వంటపట్టలేదు. ప్రధానంగా గ్రామీణ విద్యార్థులకు నెట్ సౌకర్యం, మొబైల్స్ లేక చదువులో వెనుకబడ్డారు. శాటిలైట్ ద్వారా పాఠాలు బోధించిన ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. కరోనా సమయంలో రెండేళ్లలో విద్యార్థులను ప్రభుత్వం ప్రమోట్ చేస్తూ వచ్చింది. కానీ, 2022–23 నుంచి ప్రత్యక్ష విద్యాబోధన సాగుతోంది. అయినా, ఆశించిన ఫలితాలు సాధించలేకపోతోంది.

ప్రత్యేక తరగతుల కోసం నిధులు..

పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో విద్యార్థికి సుమారు రూ.13 చొప్పున ఖర్చుచేసి ప్రత్యేక క్లాసులు నిర్వహించింది. అయినా పెద్దగా ఫలితాలు రాలేదు.

ఉమ్మడి జిల్లాలో లాస్ట్..

- ఒకప్పుడు రాష్ట్రంలోనే హ్యాట్రిక్ సాధించిన జిల్లా.. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల్లో చివరిస్థానానికి పడిపోయింది.
- రాష్ట్రంలో కరీంనగర్ నాలుగో స్థానం, సిరిసిల్ల ఆరో స్థానం, పెద్దపల్లి తొమ్మిదో స్థానంలో నిలువగా, మన జిల్లా మాత్రం ఏకంగా 24వ స్థానంలోకి పడిపోవడం విస్మయం కలిగిస్తోందని విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

84.05 శాతం పాస్..

- జిల్లా వ్యాప్తంగా మొత్తం 11,159 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలు రాశారు. ఇందులో 5,714 మంది బాలురు, 5,445 మంది బాలికలు ఉన్నారు.
- మొత్తం 9,379 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, ఇందులో 4,639, బాలురు, 4,740 మంది బాలికలు ఉన్నారు.
- జిల్లా మొత్తంగా 84.05 ఉత్తీర్ణత సాధించగా, ఇందులో బాలురు 81.19 శాతం, బాలికలు 87.05 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

ఇవి మంచి ఫలితాలు



పదో తరగతిలో జిల్లా మంచి ఫలితాలే సాధించింది. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాం. విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ తీసుకుని ఉత్తమ విద్యాబోధన చేశారు. అయినా, జిల్లా వెనుకబడే ఉంది. వీటిని మంచి ఫలితాలుగానే చూడాలి.

– మచ్చ శంకర్, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి

ఎంఈవోలను నియమించాలి



జిల్లాలో మండల విద్యాధికారులను నియమించాలి. ప్రస్తుతం ఉపాధ్యాయుల కొరత కూడా ఉంది. పర్యవేక్షణ లేక ఫలితాల్లో వెనుకంజ వేశాం. డెప్యూటీ డీఈవో పోస్టులను తక్షణమే భర్తీచేయాలి. తదనంతరం మంచి ఫలితాలు వస్తాయి.

– ఒడ్నాల రాజశేఖర్, తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నాణ్యమైన ఫలితాలు



పదో తరగతిలో నాణ్యతతో కూడిన ఫలితాలు వచ్చాయి. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా చర్యలు తీసుకున్నాం. ప్రణాళికాబద్ధంగా పరీక్షలు నిర్వహించాం. విద్యార్థులు సొంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించారు. ర్యాంక్‌తో సంబంధం లేకుండా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు.

– యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

అవినీతి చిట్టా బయట పడుతుందనే సోమేశ్‌కుమార్‌కు పదవి



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

మెట్‌పల్లి(కోరుట్ల)/జగిత్యాల: తన అవినీతి చిట్టా బయటపడకుండా సోమేశ్‌కుమార్‌కు సీఎం కేసీఆర్ ప్రధాన సలహాదారు పదవి కట్టబెట్టారని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. మెట్‌పల్లి, జగిత్యాలలో బుధవారం ఆయన బీజేపీ కార్యాలయాలు ప్రారంభించారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఉగ్ర కుట్రలను మహారాష్ట్ర పోలీసులు బట్టబయలు చేశారని, ఇక్కడి పోలీసులకు ఎందుకు సోయి లేదని నిలదీశారు. పసుపు రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.30కోట్లు కేటాయించిందన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తామని అన్నారు.

ఉత్సవాలు రెట్టింపుతో చేసుకుంటున్నాం



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల/మల్యాల(చొప్పదండి): తెలంగాణ ఆవిర్భవించాక పండగలు, పబ్బాలు, ఉత్సవాలు రెట్టింపు ఉత్సాహంతో చేసుకుంటున్నామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బుధవారం జగిత్యాలలో కుర్మ సంఘం చేపట్టిన బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్నారు. కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకుని హనుమాన్ చాలీసా పఠించారు. ఆమె మాట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయాలకు ఇప్పుడు ఎంతో గౌరవం దక్కుతోందన్నారు.

ఎస్సై అనిల్ అటాచ్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలో మంగళవారం ఆర్టీసీ బస్సులో జరిగిన సంఘటనపై రూరల్ ఎస్సై అనిల్‌ను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఎస్పీ భాస్కర్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల రూరల్ ఇన్‌చార్జి ఎస్సైగా రాయికల్ ఎస్సై కిరణ్‌కుమార్‌ను నియమించారు.

క్లుప్తంగా

నృసింహుని సన్నిధిలో వీసీ


స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందిస్తున్న సిబ్బంది

ధర్మపురి: శాతావాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సంకసాల మల్లేశ్ దంపతులు బుధవారం శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రొఫెసర్ మల్లేశ్–రేఖ దంపతులకు తొలుత సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలిన ఆలయ యంత్రాంగం.. ఆశీర్వచన మండపంలో వేదపండితులు బొజ్జా రమేశ్‌శర్మ, రమణయ్య, బొజ్జా సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆశీర్వచనం గావించారు. ఆలయ సూపరింటెండెంట్ కిరణ్, రెనోవేషన్ కమిటీ చైర్మన్ వేముల నరేశ్ స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. శ్రీచైతన్య, నవోదయ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

అద్దెలో పదిశాతం రాయితీ


రశీదు అందిస్తున్న లక్ష్మీప్రసూన

కోరుట్ల: శుభకార్యాల కోసం ఆర్టీసీ అద్దెలో పదిశాతం రాయితీ సౌకర్యం కల్పిస్తోందని కోరుట్ల డీఎం లక్ష్మీప్రసూన తెలిపారు. కోరుట్ల నుంచి జగిత్యాల వరకు రెండు పల్లెవెలుగు బస్సులను శుభకార్యం కోసం అద్దెకు బుకింగ్ చేశామని, కథలాపూర్ మండలం అంబారిపేట నుంచి జగదేవ్‌పేటకు ఎక్స్‌ప్రెస్ బస్సును బుకింగ్ చేశామని ఆమె పేర్కొన్నారు. బస్సులు అద్దెకు తీసుకునే వారికి భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణం ముత్యాల తలంబ్రాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటేశం, అధికారులు రమేశ్, కిషన్‌రావు, కార్గో మార్కెటింగ్ ప్రతినిధి రమేశ్ పాల్గొన్నారు.

తూకం వేసిన ధాన్యం తరలించాలి


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లత

కథలాపూర్(వేములవాడ): కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని అడిషనల్ కలెక్టర్ లత సూచించారు. బుధవారం తక్కళ్లపెల్లి, సిరికొండ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు అధికంగా కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండి టార్పాలిన్ కవర్లు కప్పాలన్నారు. సిబ్బంది తేమశాతం పరిశీలించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ చుక్క దేవరాజం, ఆర్‌ఐ నాగేశ్ ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన సర్కార్


పంచాయతీ కార్మికుల సమ్మెలో జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేయకుండా ప్రభుత్వమే నిబంధనలు ఉల్లంఘించిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు ఎమ్మెల్సీ బుధవారం మద్దతు పలికి మాట్లాడారు. సమ్మె చేయడం ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని గుర్తుచేశారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, ఎంపీటీసీ భూమారెడ్డి, నాయకులు గోపిరావు, గుండ మధు పాల్గొన్నారు. కాగా, కారోబార్లు, బిల్‌కలెక్టర్లు, పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మెకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సంఘీభావం ప్రకటించారు. కాగా, బీరయ్యస్వామి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

భక్తులను గమనిస్తూ వాహనాలు నడపాలి

జగిత్యాలక్రైం: హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా కాలినడకన కొండకు వచ్చే భక్తులను గమనిస్తూ వాహనాలు నడపాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొండగట్టు శ్రీఆంజనేయస్వామి దర్శనం కోసం దూర ప్రాంతాల నుంచి భక్తులు కాలినడకన వస్తున్నారని, అక్కడక్కడా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని గమనిస్తూ వాహనదారులు, భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

అసౌకర్యాలను అధిగమించి.. అగ్రగామిగా నిలిచి..

- టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత
- ప్రభుత్వ పాఠశాలల ఘనత

వందశాతం ఫలితాలు సాధించిన స్కూళ్లు

జెడ్పీహెచ్‌లు	26	టీఎస్‌ఆర్‌ఎస్	1
కేజీబీవీలు	1	టీఎంఆర్‌ఎస్	1
ప్రైవేట్ స్కూళ్లు 25			



ఎస్సెస్సీ ఫలితాల్లో వరుసగా రెండోసారి వందశాతం ఉత్తీర్ణత సాధించిన తక్కళ్లపెల్లి జెడ్పీ హైస్కూల్


10 జీపీఏ సాధించిన అఖిల్

జగిత్యాల: చుట్టూ అసౌకర్యాలు.. వెంటాడుతున్న సమస్యలు.. ఇవేమీ పదో తరగతి ఫలితాల్లో అగ్రగామిగా నిలిచేందుకు అడ్డురావని జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, గురుకులాలు నిరూపించాయి. బుధవారం వెలువడ్డ ఫలితాల్లో వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించి పేద విద్యార్థుల భవిష్యత్‌కు వెన్నుదన్నుగా నిలిచాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 29 ప్రభుత్వ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. అదేవిధంగా 25 ప్రైవేటు పాఠశాలలు కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించాయి.

మూటపల్లి.. వందశాతం..

రాయికల్(జగిత్యాల): మండలంలో 15 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉండగా, మూటపల్లి జెడ్పీ హెచ్‌ఎస్ పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో గంగాధర్ తెలిపారు. సింగరావుపేట గ్రామంలోని మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే స్కూల్ విద్యార్థి ఎలిగేటి అఖిల్ 10 జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపా తెలిపారు.

మూడు స్కూళ్లలో..

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలో 6 జెడ్పీహెచ్‌ఎస్‌లు, 1 మోడల్‌స్కూల్, 1 కేజీబీవీ, కోజన్ కొత్తూరులోని 1 ఎంపీహెచ్‌లు ఉన్నాయి. మొత్తం 291 మంది పరీక్ష రాయగా 264 మంది ఉత్తీర్ణులయ్యారని ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు తెలిపారు. ఎర్దండి, వేములకుర్తి, కోజన్‌కొత్తూర్ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయని అన్నారు. ఎర్దండి జెడ్పీ హైస్కూల్‌లో 9మంది విద్యార్థులకు 9మంది , వేములకుర్తి జెడ్పీ హైస్కూల్‌లో 15 మందికి 15 మంది, కోజన్‌కొత్తూర్ జెడ్పీ హైస్కూల్‌లో నలుగురికి నలుగురు, గోధూర్ జెడ్పీ హైస్కూల్‌లో 42 మందికి 39 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇబ్రహీంపట్నం మోడల్‌స్కూల్‌లో 92 మంది విద్యార్థులకు 86 మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీలో 16 మందికి 13 మంది పాసయ్యారు. వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 24 మందికి 23 మంది, తిమ్మాపూర్‌లో 15 మందికి 14 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇబ్రహీంపట్నం జెడ్పీ హైస్కూల్‌లో 74 మందికి 61 మంది విద్యార్థులు పాసయ్యారు.

రెండోసారి వందశాతం..

కథలాపూర్(వేములవాడ): తక్కళ్లపెల్లి జెడ్పీహైస్కూల్‌లో 25 మందికి 25మంది ఉత్తీర్ణత సాధించారు. గతంలో ఎక్కువ మార్కులు సాధించలేకపోవడంలో లోపాలపై ఉపాధ్యాయులు, విద్యార్థులు చర్చించారు. 2022–23 విద్యాసంవత్సరం ఆరంభం నుంచి పక్కా ప్రణాళికతో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. టాపిక్ వారీగా పరీక్షలు నిర్వహించి చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బ్యాచ్‌లుగా ఏర్పాటు చేశారు. తద్వారా ఉత్తమ ఫలితాలు సాధించామని ఉపాధ్యాయులు తెలిపారు.

పేదరికం అడ్డురాదని..

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదివిన పాలాస నర్సయ్య – లక్ష్మి దంపతుల కూతురు అంజలి 9.8 జీపీఏ సాధించింది. కమ్మునూర్ గ్రామానికి నర్సయ్య వడ్రంగి పని చేస్తున్నాడు. తల్లి బీడీలు చుడుతోంది. కేవలం 15 గుంటల వ్యవసాయ భూమి మాత్రమే ఉంది. ఇంజినీర్ లేదా డాక్టర్ కావాలనేది తన లక్ష్యమని అంజలి తెలిపింది. ఎంఈవో భీమయ్య, హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, సర్పంచ్ బందెల మరియ.. విద్యార్థినిని అభినందించారు.

డాక్టర్ కావటమే లక్ష్యం

కోరుట్లరూరల్: కల్లూర్ మోడల్ స్కూల్‌లో చదివిన గుమ్లాపూర్ గ్రామానికి చెందిన శ్రీగద్దె తేజశ్విని పదో తరగతి ఫలితాల్లో 100 జీపీఏ సాధించింది. తాను డాక్టర్ కావటమే లక్ష్యమని పేర్కొంది. శ్రీగద్దె శంకరయ్య–నాగలక్ష్మి దంపతులకు ముగ్గురు కూతుళ్లు. తేజశ్విని మూడో కూతురు. మొదటి కూతురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. రెండో కూతురు డిగ్రీ సెకండియర్ చదువుతోంది. శ్రీగద్దె శంకరయ్య పౌరోహిత్యం చేస్తున్నారు. ఆయన భార్య బీడీ కార్మికురాలు .తమ కూతురు 10 జీపీఏ సాధించడంపై వారు ఆనందం వ్యక్తం చేశారు.

రివిజన్‌తో అవగాహన



సార్లు పాఠాలు చెప్పిన తర్వాత ఇచ్చే సూచనలు కచ్చితంగా పాటించాం. ప్రత్యేక తరగతుల సమయంలో వారిద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవడంతో చదవడం మరింత సులభం అయింది. అందుకే ఎస్సెస్సీలో 8.8 జీపీఏ సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచా.

– వైష్ణవి, పాఠశాల టాపర్, తక్కళ్లపెల్లి

సమష్టి కృషి.. మంచి ఫలితాలు



పదోతరగతిలో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని అందరం సమష్టిగా కృషి చేశాం. ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహించి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేశాం. పరీక్షలంటే భయం పోయేలా టాపిక్‌ల వారీగా పరీక్షలు నిర్వహించాం. తన హయంలో వరుసగా రెండోసారి వందశాతం ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉంది.

– మోటూరి రవీందర్, హెచ్‌ఎం, జెడ్పీహైస్కూల్, తక్కళ్లపెల్లి

ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

- ముస్లిం సంఘాల డిమాండ్
- జిల్లావ్యాప్తంగా ఆందోళనలు


రోడ్డుపై బైఠాయించిన నిరసనకారులు

జగిత్యాలక్రైం: ఓ మహిళపై చేయి చేసుకున్నాన్న ఎస్సైపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో పలు ముస్లిం సంఘాల నాయకులు బుధవారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేశాయి. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆందోళనల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు. దీంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అయినా ఆ వర్గం ఆందోళన చేస్తూనే ఎస్పీ కార్యాలయం వరకు చేరుకుంది. కొందరు నాయకులు ఎస్పీని కలువగా తమ పరిధిలో ఉన్న విధంగా కేసు నమోదు చేశామని ఎస్పీ సర్దిచెప్పడంతో వారు శాంతించారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి(కోరుట్ల): యువతిపై దురుసుగా ప్రవర్తించిన జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌ను సస్పెండ్ చేయాలనే డిమాండ్‌తో స్థానిక కొత్తబస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం మైనార్టీలు ఆందోళనకు దిగారు. పలువురు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ఆయన భార్యకు కూర్చోవడానికి చోటు ఇవ్వలేదనే కారణంతో ఎస్సై ఆ యువతిని దూషించడమే కాకుండా కొట్టడం బాధాకరమన్నారు. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన పోలీస్ అధికారే ఇలా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఎస్సై అనిల్‌పై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనతో ఇరువైపులా ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన విరమింపజేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మర్కజీ ఇంతేజామి కమిటీ అధ్యక్షుడు ఖుత్బొద్దీన్‌తోపాటు నజీమా పాల్గొన్నారు.

రాయికల్‌లో..

రాయికల్(జగిత్యాల): జగిత్యాల రూరల్ ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ముస్లిం సెంట్రల్ కమిటీ సభ్యులు స్థానిక పాతబస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ, అకారణంగా యువతిపై ఎస్సై చేయి చేసుకోవడం శోచనీయమన్నారు. వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్, ఎస్సైకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ సభ్యులు మహ్మద్ షాకీర్, ఖలీల్, శంషేర్, జలీల్, మన్సూర్‌ఖాన్, మసూద్ పాల్గొన్నారు.

కోరుట్లలో..

కోరుట్ల : జగిత్యాల రూరల్ ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ఆవాస్ జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బస్సు సీటు విషయంలో ఓ మహిళపై ఎస్సై చేయి చేసుకోవటం శోచనీయమన్నారు. నాయకులు మహమ్మద్ షేక్ అలీ, రజియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద జరిగిన ధర్నా అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు చెందిన మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి


ఎండీ.గౌస్ మృతదేహం

మల్లాపూర్ : మండలంలోని హుస్సేన్‌నగర్ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ ఎండీ.గౌస్(40) మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని ఒబులాపూర్ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాలతో లారీ మెట్‌పల్లికి వెళ్తుండగా, హుస్సేన్‌నగర్–ముత్యంపేట రహదారిపై చెట్టుకొమ్మ ధాన్యం బస్తాలకు తగిలి కొమ్మ విరిగిపోవడంతో పాటు బస్తాలు కిందపడ్డాయి. దీంతో లారీని డ్రైవర్ లికాయత్ పక్కకి ఆపివేయడంతో లారీ క్లీనర్ ఎండీ.గౌస్ చెట్టుకొమ్మతో పాటు ధాన్యం బస్తాలను రోడ్డుపై నుంచి తొలగిస్తుండగా, మెట్‌పల్లి నుంచి హుస్సేన్‌నగర్‌కు చెందిన షరీఫ్, సాదుల్లా అనే ఇద్దరు బైక్‌పై అతివేగంగా వచ్చి లారీ క్లీనర్ ఎండీ.గౌస్‌ను ఢీకొట్టడంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. షరీఫ్, సాదుల్లా ఇద్దరు గాయపడగా మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనస్థలికి వెళ్లి విచారణ చేపట్టారు.

మహిళ ఆత్మహత్య

కోరుట్ల రూరల్ : పట్టణానికి చెందిన విలాసాగర్ గంగజల (40) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గంగజల భర్త మహేశ్ గల్ఫ్ వెళ్లగా ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పులబాధతో మనోవేదన చెందేది. బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొంది. కుమారులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడు కార్తీక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడిపై లైంగికదాడి

కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని డాగ్ బంగ్లా సమీపంలో నివాసం ఉండే ఓ యువకుడి(19)పై అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు లైంగిక దాడికి పాల్పడ్డట్లు పోలీసులు తెలిపారు. గతంలో కూడా రెండుసార్లు తనపై లైంగికంగా దాడిచేశారని యువకుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యంలో తలంబ్రాలు


రేషన్ బియ్యంలో వచ్చిన తలంబ్రాలు

జగిత్యాల క్రైం : జిల్లాలోని మల్లాపూర్ మండల కేంద్రంలో రేషన్ షాపు–2లో బుధవారం రేషన్ డీలర్ మేడి శివసాయి బియ్యం పంపిణీ చేస్తుండగా భూక్య నందు అనే వినియోగదారుడికి బియ్యంలో వివాహానికి వినియోగించిన తలంబ్రాలు వచ్చాయి. దీంతో డీలర్ తహసీల్దార్ రవీందర్‌కు ఫోన్‌చేయగా బియ్యం పంపిణీ నిలిపివేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

‘పది’ ఫలితాల్లో ‘మానేరు’ విజయఢంకా


టాపర్స్‌తో విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): పదోతరగతి ఫలితాల్లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు విజయఢంకా మోగించినట్లు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి తెలిపారు. 9 మంది సనా ఫర్హత్, సహస్ర, శిరీష, చరిష్మా, స్ఫూర్తి, స్నిగ్ధ, హన్సిక, అద్నాన్, దర్శీల్‌లు 10 జీపీఏ, 14 మంది 9.8 జీపీఏ, ఏడుగురు 9.7 జీపీఏ, ఆరుగురు 9.5 జీపీఏ, 54 మంది 9.0 ఆపై జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానేరు విద్యాసంస్థల విద్యార్థులందరూ ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. విద్యార్థులను విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డితోపాటు డైరెక్టర్లు కడారి సునీతారెడ్డి, కృష్ణారెడ్డి, శ్వేతారెడ్డి, ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

‘పారమిత’ విద్యార్థుల విజయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కరీంనగర్: పదోతరగతి ఫలితాల్లో పారమిత పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. 11 మంది 10 జీపీఏ, 20 మంది 9.8 జీపీఏ, 38 శాతం మంది 9.5 ఆపైన జీపీఏ, 65 శాతం విద్యార్థులు 9.0 ఆపైన జీపీఏ, 91 శాతం మంది 8.0 ఆపైన జీపీఏ సాధించారు. విద్యార్థులను పారమిత పాఠశాలల అధినేత ఇ.ప్రసాదరావు అభినందించారు. తమ విద్యాసంస్థల్లో నైపుణ్యాలకు పెద్దపీట వేసి, ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని తట్టుకునేలా పిల్లలను అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. డైరెక్టర్లు ప్రసూన, అనుకర్‌రావు, రష్మిత ప్రసాద్, రాకేశ్, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, ఎస్‌వోడీ తిరుపతిరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ‘తేజస్’ సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కరీంనగర్: ఇంటర్ ఫలితాల్లో తేజస్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని కళాశాల యాజమాన్యం సీహెచ్.సతీశ్‌రావు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కె.యశ్వంత్ 465, యు.హర్షిత్ 464, టి.గణేశ్ 463, ఎం.రమేశ్‌కుమార్ 461 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సీహెచ్.సూర్య 984, ఎస్.శ్రావణ్‌రెడ్డి 981, సీ ఈసీలో ఎ.అక్షయ్ 973 మార్కులు సాధించారని పేర్కొన్నారు.

‘నేతన్న’ డాక్యుమెంటరీ విడుదల


డాక్యుమెంటరీ విడుదల చేస్తున్న చైర్మన్ ప్రవీణ్

కరీంనగర్ కల్చరల్: ఒకప్పుడు నేత కార్మికుల ఆత్మహత్యలకు నిలయమైన సిరిసిల్ల ఇప్పుడు ఆ సామాజికవర్గానికి నిజమైన సిరిసంపదల ఖిల్లాగా మారింది. దీన్ని వివరించే జై మార్కండేయ బ్యానర్‌పై రూపొందించిన ×నేతన్న డాక్యుమెంటరీని బుధవారం హైదరాబాద్ నారాయణగూడలోని టెస్కో భవన్‌లో తెలంగాణ పవర్‌లూం, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావం తర్వాత మంత్రి కేటీఆర్ కృషితో సిరిసిల్ల నేతన్నల జీవితాల్లో వెలుగులు ప్రసరించిన తీరుపై పద్మశాలీ మహిళ గోనె స్వర్ణ అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ డాక్యుమెంటరీ తీశారని తెలిపారు. ఇది వాస్తవాలకు అద్దం పట్టిందన్నారు. కార్యక్రమంలో డాక్యుమెంటరీ సమర్పకుడు గోనె రాజేంద్రప్రసాద్, దర్శకుడు అయిలు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ విద్యార్థుల విజయఢంకా


కలకోట శ్రీజ


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గొల్లపల్లి: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ పాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో విజయఢంకా మోగించారు. 99 మంది విద్యార్థులకు 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ ఈరవేని రాజ్‌కుమార్ తెలిపారు. 10/10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా కలకోట శ్రీజ నిలవగా గుండేటి రితీత ద్వితీయ స్థానంలో నిలిచింది. నల్ల అర్చన 9.7, మామిడి పెల్లి హన్సిక 9.7, కాచర్ల సాహిత్య 9.7 సాధించింది. 9 జీపీఏ నుంచి 10 జీపీఏ సాధించిన విద్యార్థులు మొత్తం 23 మంది ఉన్నారు. మొత్తం 99 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 98 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు.

పదో ఫలితాల్లో గురుకులాల విద్యార్థుల సత్తా

మెట్‌పల్లి: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ గురుకులాల విద్యార్థులు సత్తా చాటారు. పెద్దాపూర్‌లోని సాంఘిక సంక్షేమ, పట్టణంలోని మైనార్టీ బాలుర గురుకులాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. రాజేశ్వర్‌రావుపేట, సత్తెక్కపల్లి, మేడిపల్లి పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో మహిత, యశస్వి, హర్షిణి 10జీపీఏ సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ కోటగిరి ఆనందం అభినందించారు.

‘అంజన్న’ సేవలో హైకోర్టు న్యాయమూర్తులు


న్యాయమూర్తులను సన్మానిస్తున్న ఆలయ అధికారులు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామిని బుధవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు 13 మంది దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ ఈవో వెంకటేశం , సూపర్‌వైజర్ సునీల్ న్యాయమూర్తులను శాలువాలతో సన్మానించి, స్వామివారి ప్రసాదం అందజేశారు. హైకోర్టు న్యాయమూర్తులు కె.లక్ష్మణ్, పి.శ్రీసుధ, ఎం.లక్ష్మణ్, ఎ.తుకారాంజీ, పి.మాధవి దేవి, నంద, జి.అనుపమ చక్రవర్తి, సాంబశివ రావు నాయుడు, ఎ.సంతోష్‌రెడ్డి, వేణుగోపాల్, కె.శరత్, జె.శ్రీనివాస్ రావు, నామవరపు రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

15 వరకు ఆర్జిత సేవలు బంద్

మల్యాల: కొండగట్టు హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 12 నుంచి 15 వరకు ఆలయంలో ఆర్జిత సేవలు నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈవో వెంకటేశం తెలిపారు. జయంతి రద్దీ నేపథ్యంలో ఆర్జిత సేవలు నిలిపివేశామన్నారు.